క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుము చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, అనురాధ, ఎస్.సతీష్, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ దృష్టికి సమస్యలు



సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ జానకీరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ జోనల్ కమిషనర్ శివప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. కాల్వల్లో పేరుకుపోతున్న చెత్తతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోందని, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెబుతూ గురువారం శానిటరీ సిబ్బందితో కలిసి పలు పనులు పూర్తి చేయించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్షకు శ్రీకారం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో మణికంఠ మిత్ర బృందం ఆధ్వర్యంలో 41 రోజుల పాటు ఉచిత భిక్ష కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కాలనీలో దశరథ రామాలయం ఆవరణలో అయ్యప్ప స్వాముల పూజా మండపం ఏర్పాటు చేశారు. ఈ మండపంలో రోజుకు 1,000 మందికిపైగా స్వాములకు అన్నదానం చేయనున్నట్టు మిత్ర బృందం సభ్యుడు మణికంఠ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్వాములు విజయవంతం చేయాలని కోరారు. తొమ్మిది సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం స్వాములు పాల్గొన్నారు.

16న బహిరంగ వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్ – 4 పరిధిలో గల దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్లకు సంబంధించి ఈ నెల 16న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల వారు ఆ రోజు ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు జోన్ – 4 కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని కోరారు.

ఎఫ్‌డీపీ తరగతులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై మూడు రోజుల పాటు ఈ తరగతులు జరగనున్నాయి. కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ



ప్రసాద్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జగదాంబ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు బాసటగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. గురువారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో పండావీధి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ముందుగా చేపట్టిన సర్వే ప్రకారం ఈ వైద్య శిబిరానికి 618 మంది వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. షుగర్, బీపీ, తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 123 మందికి కంటి పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 12 మందిని కేజీహెచ్‌కు తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సకు సిఫార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులు, కన్వీనర్లు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సచివాలయానికి సంబంధించి వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటికే అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని తెలిపారు. సుమారు 235 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీలా తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జగన్‌బాబు దయతో వైద్యం



జగన్‌బాబు దయతో తమ చెంతనే వైద్యం అందుతోంది. మాలాంటి వృద్ధులం దూరంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లలేకపోతున్నాం. ఎవరైనా వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్తారని ఎదురుచూసే మాకు వీధుల్లోనే వైద్యం అందిస్తున్నారు. ఎప్పుడు ఇలాగే ఉంటే బాగుంటుంది.

– రామయమ్మ, జీవీఎంసీ 35వ వార్డు

ఆరోగ్యానికి భరోసా



ఆరోగ్యానికి భరోసా కలిగింది. వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఇంట్లోనే ఉండిపోయేవాళ్లం. ఇప్పుడా భయం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ధైర్యం వచ్చింది. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నాను.

– లక్ష్మి, జీవీఎంసీ 35వ వార్డు

మర్యాదపూర్వక కలయిక



ఐసీఐడీ సదస్సులో పాల్గొనేందుకు గురువారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మధురవాడలో హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– డాబాగార్డెన్స్

ఉపాధి అవకాశాలు కల్పించాలి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుకు గల కారణాల విశ్లేషణకు, అన్ని రంగాల అభివృద్ధికి ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఉత్తరాంధ్ర ప్రజలు పరాయి పాలనలోనే ఉన్నారని, ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా రంగాల్లో స్వాతంత్ర్యం కావాలని, స్వపరిపాలన కావాలని, మమ్మల్ని మేమే పరిపాలించుకోవాలని, మా సంస్థలు మేమే నడుపుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్‌పరం కాకుండా ప్రభుత్వ సంస్థగానే ఉంచాలని కోరారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు గౌరవించాలని, అభివృద్ధి చేయకపోతే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వాలని కోరారు.

ఘనంగా సమాధుల పండగ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో గురువారం మృతుల సంస్మరణ దినం(సమాధుల పండగ) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జ్ఞానాపురం చావులమదుం వంతెనకు సమీపంలోని శ్మశానవాటికలోని సమాధుల వద్ద వందలాది క్రైస్తవులు సాయంత్రం ప్రార్థనలు చేశారు. ప్రతి ఏటా నవంబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా రోమన్ కేథలిక్‌కు చెందిన క్రైస్తవులు తమ బంధువుల ఆత్మకు శాంతి చేకూరాలని ఇలా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధానాలయంలో ఉదయం దివ్యబలి పూజలు నిర్వహించారు. జ్ఞానాపురం ప్రాంతంలోని జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగడ్డు పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పునీత పేతురు దేవాలయం ఫాదర్లు అజేయ్, యేసు, పీపీసీ సభ్యులు, ఫాదర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలకంటే అన్నదానం మిన్న



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు

అల్లిపురం: అన్నిదానాలకంటే అన్నదానం గొప్పదని దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. అల్లిపురం, గోవింద్‌రోడ్డులో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అన్నసంతర్పణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, ఉరికిటి నారాయణ, ఆడారి వెంకటమహేష్ తదితరులు పాల్గొన్నారు.

– కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

3 వేల మందికి అన్నదానం

జగదాంబ: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యువకుడు మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ప్రారంభించారు. చుట్టు పక్కల పరిసర ప్రాంతాల ప్రజలు సుమారు 3 వేల మంది తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

25న విరాట్ హిందూ సమ్మేళనం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ మైదానంలో ఈ నెల 25న విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు. విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు గురువారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ హిందుత్వంపై అసాంఘిక శక్తుల దాడులను అడ్డుకోవడానికి ఇలాంటి సమ్మేళనాలు అవసరమన్నారు. కొంతమంది కొన్ని వర్గాల మెప్పు కోసం సనాతన ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. అలాంటి వారి వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం హిందుత్వ వాదులపై ఉందన్నారు. హిందుత్వాన్ని రక్షించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో తుప్పల తొలగింపు



ముడసర్లోవ పార్కు గట్టుపై పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది



శుభ్రం చేసిన భారతమాత మ్యాప్ ఉన్న గట్టు భాగం

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక ప్రాంతం ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ అధికారులు తుప్పల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ పార్కు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. పాముల సంచారం ఎక్కువైపోయింది. దీంతో ఈ పార్కుకు సందర్శకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పార్కు నిర్వహణ చూస్తున్న ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ అప్పాజీ ఇక్కడ సిబ్బందితో కొద్ది రోజులుగా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. పిల్లల ఆట స్థలాల్లో పెరిగిన తుప్పలను తొలగించారు. ఆట పరికరాల వద్ద చెత్త, గోతులు లేకుండా సిద్ధం చేస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరు గట్టుపై కూడా పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. రానున్న కార్తీక మాసాన్ని దృష్టిలో పెట్టుకొని పార్కు అంతటా శుభ్రం చేయిస్తున్నామని ఏఈ తెలిపారు. సందర్శకులకు అనుకూలంగా ఉండేటట్లు తయారు చేస్తున్నామన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీన్ ఆచార్య విజయ్‌మోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసనాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. వర్సిటీలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద కూడా ర్యాగింగ్ నిషేధంపై ప్రత్యేక బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

'మీ ఇంటికి మీ కార్పొరేటర్'కు విశేష స్పందన



యాతపేటలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: ప్రజా సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి గత నెల 4న శ్రీకారం చుట్టిన 'మీ ఇంటికి మీ కార్పొరేటర్'కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం యాతపేట సచివాలయం పరిధిలో స్థానిక నాయకులు లక్ష్మణరావుతో కలసి పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. వార్డు ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు విన్నవించుకోవచ్చని చెప్పారు.

రంధి గోపికి పరామర్శ



రంధి గోపీకృష్ణను పరామర్శిస్తున్న సీతంరాజు సుధాకర్


అల్లిపురం: వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణకు ఇటీవల పితృవియోగం జరిగిన సంగతి విదితమే. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్.. గోపి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబానికి ఆయన తన ప్రగాఢ సంతపం తెలిపారు. కార్పొరేటర్ ఉరుకుటి నారాయణ, ఆడారి వెంకటమహేష్, తదితరులు పాల్గొన్నారు.

నాక్ మెచ్చేలా.. ఏయూ ముస్తాబు

- వర్సిటీలో రేపటి నుంచి ఆరుగురు సభ్యుల బృందం పర్యటన



ఇంజినీరింగ్ కళాశాలలో సాధన చేస్తున్న విద్యార్థులు



సుందరంగా దర్శనమిస్తున్న భౌతికశాస్త్ర విభాగం

ఏయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) పీర్ కమిటీ పర్యటనకు ఏయూ ముస్తాబవుతోంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఆరుగురు సభ్యుల కమిటీ బృందం ఏయూలో పర్యటించనుంది. కమిటీ పర్యటనకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే వర్సిటీలో ప్రతి విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కమిటీ మూడు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ శుక్రవారం ఖరారు కానుంది. ప్రతి విభాగాన్ని కమిటీ సభ్యులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో తదనుగుణంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే విభాగాల వారీగా అవసరమైన మౌలిక వసతులు కల్పన పూర్తి చేశారు. సుందరీకరణ పనులు సైతం తుది దశకు వచ్చాయి.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

కమిటీ సభ్యులు పరిశీలించే ప్రధాన విభాగాలు, కళాశాలలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. విభాగాలకు వెళ్లే మార్గాలు, ఫుట్‌పాత్‌లను ఆకర్షణీయంగా తయారు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం, ర్యాగింగ్ నిషేధం, దిశ చట్టంపై అవగాహన తదితర అంశాలపై తయారు చేసిన ప్రత్యేక సైన్ బోర్డులను వర్సిటీలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం వర్సిటీలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించడం, రహదారులను శుభ్రం చేయడం చేస్తున్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రతి విభాగాన్ని ఇప్పటికే పలుమార్లు సందర్శించారు. అవసరమైన సూచనలు చేస్తూ పనులు పూర్తి చేశారు. నాక్ కమిటీ సభ్యులు సందర్శనకు వచ్చే సమయంలో తమ విభాగ ప్రగతిని ఆయా విభాగాధిపతులు వివరించాలని సూచించారు. గతంలో కంటే మెరుగైన ర్యాంక్ ఏయూ సాధించే లక్ష్యంగా అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. ప్రస్తుతం లభించే ర్యాంక్ రానున్న ఆరు సంవత్సరాలకు దోహదపడనుంది. శతాబ్ది వేడుకలకు చేరువవుతున్న ఏయూ మెరుగైన ర్యాంక్ సాధించాలని అంతా ఆకాంక్షిద్దాం..



రంగులు అద్దిన వర్సిటీ ప్రవేశ ద్వారం

నేవీలో ఉద్యోగం పేరిట రూ.5.67 లక్షలకు టోకరా

తగరపువలస: నేవీలో తన కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని జీవీ అగ్రహారం(అప్పికొండవీధి)కి చెందిన ఆదిలక్ష్మి దఫదఫాలుగా తన నుంచి రూ.5,67,000 కాజేసి ఇప్పుడు ముఖం చాటేసిందని తోటవీధికి చెందిన గరుగు సావిత్రి ఆరోపిస్తోంది. బీఎస్సీ చదువుతున్న తన కుమార్తె కల్యాణికి నేవీలో మునీషా బేగం అనే మహిళ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ మొత్తాన్ని కాజేసినట్టు బాధితురాలు తెలిపింది. ఉద్యోగం కోసం మరో రూ.1.60 లక్షలు అడగటంతో మోసపోయినట్టు గుర్తించినట్లు చెప్పింది. దీనిపై గతంలో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా సెప్టెంబర్‌లో రూ.20 వేలు ఇచ్చి మిగిలిన వాయిదాలు చెల్లించలేదన్నారు. విడతల వారీగా డబ్బులు తిరిగి ఇస్తానని ఆదిలక్ష్మి పోలీసుల ముందు అంగీకారపత్రం ఇచ్చి.. ఇప్పుడు ముఖం చాటేస్తోందన్నారు. కుమార్తె ఉద్యోగం కోసం అప్పులు తెచ్చి మోసపోయానని, భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేస్తోంది.

అవినీతి నిర్మూలనలో కీలక పాత్ర పోషించాలి



అవినీతి నిర్మూలన వారోత్సవ సభలో అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం : అవినీతి నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు కోరారు. అవినీతి నిర్మూలన వారోత్సవాలను కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అవినీతి రహిత సమాజా స్థాపనలో విద్యార్థుల పాత్ర కీలమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ సతీష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.